మెదక్
నమస్తే తెలంగాణ
బుధవారం 16 ఏప్రిల్ 2025
WEDNESDAY, APRIL 16, 2025

# ప్రతి పల్లె నుంచి తరలివెళ్దాం

**సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి**

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 15 : ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు ప్రతి పల్లె నుంచి తరలి వెళ్దామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. పల్లె పల్లెలో గులాబీ జెండా ఎగుర వేయాలని, వారం రోజుల్లో గ్రామాలు, పట్టణాల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసుకొని ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. పార్టీ ఇచ్చిన పిలుపును నూటికి నూరు శాతం విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 16 నెలలు అవుతున్నా అభివృద్ధి శూన్యమన్నారు. వరంగల్ సభకు బీఆర్ఎస్ అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కో-కన్వీనర్లు జుబేర్, కృష్ణాగౌడ్, మాజీ ఎంపీపీ శేరి నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి


పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

# వైద్య శిబిరం విజయవంతం

నిజాంపేట, ఏప్రిల్ 15 : నిజాంపేటలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మల్లారెడ్డి దవాఖాన సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వాహకులు మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సై రాజేశ్ హాజరై ప్రారంభించారు. రోగులకు వైద్య సిబ్బంది బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు రాజశేఖర్ రెడ్డి, దామోదర్, యాదగిరి, మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి, నాయకులు చల్మేటి నరేందర్, వెంకటేశ్ గౌడ్, వెంకటేశం, సిద్ధిరాంరెడ్డి, శ్రీనివాస్, వైద్య సిబ్బంది ఉన్నారు.


ఉచిత ఆరోగ్య శిబిరం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై రాజేశ్

# మొబైల్ దుకాణంలో చోరీ చేసిన నిందితుడి అరెస్టు

నర్సాపూర్, ఏప్రిల్ 15 : నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల ఓ మొబైల్ దుకాణంలో చోరీ చేసిన వ్యక్తిని పట్టుకొని జైలుకు తరలించామని ఎస్సై లింగం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న కౌడిపల్లి మండలానికి చెందిన గుడ్డం శరత్ కుమార్ మొబైల్ షాప్‌లో చోరీ చేశాడు. యజమాని శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా, శరత్ కుమార్ వేలి ముద్రలను గుర్తించారు. మంగళవారం గండిమైసమ్మ నుంచి కౌడిపల్లి వెళ్తుండగా సమాచారం మేరకు పట్టుకొని నిందితుడి నుంచి మొబైల్ ఫోన్లను రికవరీ చేసి, రిమాండ్‌కు తరలించారు.

# బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



జిల్లా విద్యాధికారిని సన్మానిస్తున్న రోటరీక్లబ్, బాలికల పాఠశాల సిబ్బంది

రామాయంపేట, ఏప్రిల్ 15 : బాలికలు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్, రోటరీ క్లబ్ చైర్మన్ జస్వీందర్‌సింగ్ అన్నారు. మంగళవారం రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.6 లక్షలతో నిర్మాణం చేపట్టిన బాలికల టాయిలెట్లను ప్రారంభించి మాట్లాడారు. బాలికల కోసం ప్రత్యేకంగా తమ రోటరీ క్లబ్ ట్రస్టు నుంచి ఆరు లక్షలను సమకూర్చి టాయిలెట్ల నిర్మాణం చేపట్టినట్లు క్లబ్ చైర్మన్ జస్వీందర్‌సింగ్ అన్నారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ బాలకలు ఉన్నత స్థాతికి ఎదగాలనే ఆలోచనతో క్లబ్ నుంచి నిధులను టాయిలెట్ల కోసం ఖర్చు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద విద్యార్థులే ఎక్కువ శాతం చదువును అభ్యసిస్తారని వారి కోసం క్లబ్ ఆధ్వర్యంలో నిర్మాణ చేపట్టడం మంచి పరిణామమన్నారు. దాతల సహకారం మరువలేమన్నారు. అనంతరం జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌ను, రోటరీ క్లబ్ బృందం సభ్యులు ఘనంగా సన్మానించారు. హెచ్ ఎం. రమ, ఉపాధ్యాయురాళ్లు ఉన్నారు.

# కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 15 : డీఎస్సీ 2008 కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను నియమించి రెండు నెలలు పూర్తి కావస్తున్నా వారి వేతనాలపై స్పష్టత లేకపోవడం వల్ల ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నదని తపస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడారు. డీఎస్సీ రాసి ఫలితాలు వచ్చిన 15 సంవత్సరాల తర్వాత కాంట్రాక్ట్ ప్రతిపాదన విధుల్లోకి తీసుకున్న ప్రభుత్వం నేటి వరకు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనపక్షంలో తపస్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఉద్యమించడానికి సిద్ధంగా ఉంటామన్నారు. సమావేశంలో తపస్ నాయకులు నర్సింహులు, మాధవరెడ్డి, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు


చేగుంట మండల రెడ్డిపల్లిలో ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న రాచకొండ పోలీస్ కమిషనర్‌రేట్ సీఐ మాదాస్ శంకర్‌గౌడ్, తదితరులు.

-చేగుంట, ఏప్రిల్ 15

# తాగునీటి ఇబ్బందులు పరిష్కరించాలి

- జిల్లాలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా
- తాగునీటి సరఫరా.. ఇందిరమ్మ గృహ నిర్మాణాలు పురోగతిపై అధికారులతో సమీక్ష
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : తాగునీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలని, ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని అధికారులను కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ప్రజావాణి హాలు నందు వేసవిలో తాగునీటి సరఫరా, ఇందిరమ్మ గృహ నిర్మాణాల పురోగతి విషయాలపై అదనపు కలెక్టర్ నగేశ్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, డీఆర్‌వో భుజంగరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్, స్పెషల్ ఆఫీసర్స్, ఎంపీడీవోలు, ఎంపీవోలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి పూర్తి చేసుకొని వర్షాలు వచ్చే వరకు తాగు నీటి సరఫరా అంశంపై అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో తాగునీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రత్యేక సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించి తద్వారా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళిక, నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు, వాటిని పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలు, నీటి పునరుద్ధరణ వివరాలు తెలియజేయాలన్నారు. వేసవిలో తాగునీటి సరఫరాకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధంగా ఉన్నామని అన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి క్షేత్ర స్థాయి నుంచి రెగ్యులర్ ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి తాగునీరు ఇబ్బందులు తొలిగించి ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా సప్లిమెంట్ చేయాలని పేర్కొన్నారు. రానున్న రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను వెంటనే గుర్తించి వాటిని సత్వరం పరిష్కారం అయ్యే విధంగా చూడాలని, తాగునీటి సరఫరాను ప్రతిరోజు పర్యవేక్షించాలని. ప్రత్యామ్నాయ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు తాగునీరు సరఫరా అవుతున్న హ్యాబిటేషన్స్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి రిపోర్టు అందించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపికలో దారిద్య్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలను ఎంపిక చేయాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలని సూచించారు. ప్రతి గ్రామం నుంచి లబ్ధిదారుల జాబితాను తయారు చేయాలని అట్టి జాబితా ప్రకారం విచారణకు గెజిటెడ్ అధికారులను విచారణ అధికారులుగా నియమించనున్నట్లు తెలిపారు. ప్రతి గెజిటెడ్ అధికారి 200 మంది లబ్ధిదారుల జాబితా ఇవ్వనున్నట్లు, ప్రతి రోజు కనీసం 25 మంది లబ్ధిదారుల విచారణ చేపట్టి ఇట్టి ప్రక్రియను 8 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు


పెద్దచింతకుంటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 15 : దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చిప్పల్‌తుర్తి, పెద్దచింతకుంట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధరను పొందాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకట నర్సింగరావు, మాజీ సర్పంచ్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సత్యంగౌడ్, చంద్రశేఖర్, నయీమొద్దీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి**


సమీక్షలో మాట్లాడుతున్న తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

వెల్దుర్తి, ఏప్రిల్ 15 : యాసంగి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి మండల అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ, ధాన్యం తరలింపుపై మంగళవారం వెల్దుర్తి పీఏసీఎస్ కార్యాలయంలో మండల అధికారులు, రైస్‌మిల్లుల యజమానులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగ ఆర్డీవో మాట్లాడుతూ ఉమ్మడి వెల్దుర్తి మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 18, ఐకేపీ ఆధ్వర్యంలో 3, ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో 3 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, టార్ఫలిన్లు, తాలు యంత్రాలు, అందుబాటులో ఉంచాలని, తాగునీటి వసతి, నీడ కల్పించాలన్నారు. ఈ సమీక్షలో తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి, ఏవో ఝాన్సీ, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి,అధికారులు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

# రోడ్లపై ధాన్యం ఆరబెట్టొద్దు

మెదక్ అర్బన్, ఏప్రిల్15 : రహదారులపై ధాన్యం ఆరబోసి రోడ్డు ప్రమాదాలకు కారణం కావొద్దని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి మంగళవారం తెలిపారు. రహదారులపై ధాన్యం ఆరబెట్టడం వల్ల రోడ్లు ఇరుకుగా మారి రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని వెల్లడించారు. ధాన్యం కుప్పల చుట్టూ పెద్ద బండరాలను పెడుతున్నారని, గమనించని వాహనదారుల రోడ్డు ప్రమాదాలకు గురి అయ్యి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఇటీవల చాలా చోటుచేసుకున్నాయని తెలిపారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతి

చేగుంట, ఏప్రిల్ 15 : అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని కోరుతూ సీఐటియూ జిల్లా నాయకురాలు బాలమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మద్ది లక్ష్మీనర్సయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన చేగుంటలో మంగళవారం డబుల్‌బెడ్ రూమ్‌ల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం చేగుంట తహసీల్దార్‌కు వినతి ప్రతం సమర్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జయప్రద, గంగమణి, గొల్లలక్ష్మి, ఎల్లమ్మ, మీనా, జ్యోతి, కవిత, గంగ, రేవతి, లక్ష్మి ఉన్నారు.


తహసీల్దార్‌కు వినతి ప్రతం అందజేస్తున్న డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులు ,నేతలు

# పరామర్శించేందుకు వెళ్లి అనంతలోకాలకు

**ఆర్టీసీ బస్సు ఢీకొని భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు**

శివ్వంపేట, ఏప్రిల్ 15 : బంధువులు దవాఖానలో ఉన్నారని.. పరామర్శించేందుకు వెళ్లిన భార్యాభర్తలకు ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో భర్త అక్కడికక్కడే మృతిచెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన సీతల వెంకటేశం (42), సుమలత భార్యాభర్తలు. తూప్రాన్‌లో ఓదవాఖానలో బంధువులను పరామర్శించేందుకు మంగళవారం బైక్‌పై బయలుదేరగా, శివ్వంపేట మండలం దొంతి గ్రామ శివారులో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ప్రమాదంలో వెంకటేశం మృతిచెందగా, సుమలతకు తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# భూ భారతి చట్టంపై సదస్సులు పక్కాగా నిర్వహించాలి

మెదక్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నందు భూభారతి చట్టం, జిల్లాలో ధాన్యం కొనుగోలు నిర్వహణ తీరుపై అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన భూ భారతి ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, వకీలు, రైతు సంఘాల నాయకులు, సభ్యులను కూడా ఈ సదస్సులో భాగస్వామ్యం చేయాలని, చట్టంలో ఉన్న ప్రాధాన్యత అంశాల వివరాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా కరపత్రంపై ముద్రించాలన్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. మిగిలిన కొనుగోలు కేంద్రాలను కూడా త్వరితగతిన ప్రారంభించాలని, కేంద్ర నిర్వాహకులు ప్రతి రోజు కేంద్రాలను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో భుజంగరావు, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, తూప్రాన్ జైచంద్రారెడ్డి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

# చెరువు మట్టి తరలించిన ట్రాక్టర్లు పట్టివేత

చిలిపిచెడ్, ఏప్రిల్ 15 : మండలంలోని మంజీరా నది, చెరువులో అనుమతులు లేకుండా మట్టి, ఇసుక తరలించే వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సింధూజ, ఆర్ఐ సునీల్ సింగ్ చౌహన్ హెచ్చరించారు. మండలంలోని చం డూర్ గ్రామ శివారులోని మంజీరా నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. సోమక్కపేట శివారులో సామ్లాతండా అనుమతి లేకుండా ప్రభుత్వ భూమి నుంచి అక్రమం గా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌లను, ఆర్ఐ పట్టుకున్నారు. అనంతరం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ యజమాని చం డూర్ గ్రామానికి చెందిన మద్దూరి లక్ష్మయ్యకు రూ. పది వేలు, సామ్లాతండాకు చెందిన భిక్షపతి నాయక్‌కు రూ.ఐదు వేలు జరిమానా వేసినట్లు తెలిపారు. మండలంలో ఎక్కడైనా ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.


చండూర్ గ్రామ శివారులో రెవెన్యూ అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

# ప్రమాదవశాత్తు నీట మునిగి ఒకరి మృతి

పాపన్నపేట, ఏప్రిల్ 15 : ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పాపన్నపేట గ్రామ శివారులోని సాలం చెరువులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని నర్సింగరావుపల్లి తండాకు చెందిన లూనావత్ గోపాల్ (39) భిక్షాటన చేసుకుంటూ జీవితం గడుపుతున్నాడు. రోజు మాదిరిగానే ఈనెల 12న ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. పాపన్నపేట గ్రామ శివారులో స్నానం చేయడానికి సాలం చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మంగళవారం చెరువువైపు వెళ్లిన స్థానికులకు మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని వెలికి తీసి గోపాల్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# 24న పీపుల్స్ ప్రోగెసివ్ ట్రస్ట్ టాలెంట్ టెస్ట్

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 15 : హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీకాలనీ ప్రగతి విద్యా నికేతన్ పాఠశాలలో ప్రవేశాలకు ఈనెల 24న పీపుల్స్ ప్రోగెసివ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం మెదక్‌లోని న్యూ హైస్కూల్‌లో ఉదయం 9.30 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మారావు, శ్రీనివాస్‌రావు మంగళవారం తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 4, 5, 6వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులన్నారు. ఎంపికైన నాటి నుంచి డిగ్రీ వరకు ఉచిత విద్యతో పా టు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తారు. విద్యార్థుల ఎంపిక క్రమంలో ముఖ్యంగా అనాథ పిల్లలు, తల్లి తండ్రి లేని పిల్లలు, నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ పరీక్షకు ఆన్‌లైన్‌లో గూగుల్ షీట్ ద్వారా ఈ నెల 18వ తేదీ సాయంత్రం 8 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# ఫలితాలను తల్లిదండ్రుల సమక్షంలో అందించాలి

చేగుంట, ఏప్రిల్ 15 : విద్యార్థులకు సంబంధించిన పరీక్షల ఫలితాల వివరాలను తల్లిదండ్రుల సమక్షంలో అందించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో అనంతరం జరుగుతున్న సమ్మేటివ్ పరీక్షలను పరిశీలించారు. ఈనెల 23న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమక్షంలో విద్యార్థులకు ఫలితాలను అందించాలని సూచించారు. హెచ్‌ఎం గంగబాయి, ఉపాధ్యాయులు దేశపతి కృష్ణమూర్తి, సురేశ్, గోవింద్, రాజశేఖర్, శంకర్, శ్రీదేవి ఉన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

# బాధ్యతలు స్వీకరించిన ఎస్సైకి సన్మానం

నిజాంపేట, ఏప్రిల్ 15 : నిజాంపేట ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాజేశ్‌ను దళిత సంఘాల నాయకులు బాబు, సంజీవ్, ఎల్లం, శ్రీనివాస్, సుధాకర్,అమర్, రాజేందర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్సై రాజేశ్‌కు శాలువా కప్పి సన్మానించారు.

ఎస్సై రాజేశ్‌కు శాలువా కప్పి సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు



# చికిత్స పొందుతూ విషమించి వ్యక్తి మృతి

పాపన్నపేట, ఏప్రిల్ 15 : చికిత్స పొందుతూ విషమించి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గాంధారిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బేజి జైలు (64) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మార్చి 31న ఇంటి సమీపంలో ఉన్న కిరాణా దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా కండ్లు తిరిగి రోడ్డుపై పడ్డాడు.దీంతో తలకు గాయమైంది. చికిత్స నిమిత్తం అదే రోజు కటుంబీకులు మెదక్ ఏరియా దవఖానకు తరలించారు. అక్కడి నుంచి మరుసటి రోజు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడు రత్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 15 : రాష్ట్ర న్యాయసేవాధికా సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ లక్ష్మీశారద ఆధ్వర్యంలో జిల్లా న్యాయస్థానముల సముదాయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జితేందర్, తదితరులు పాల్గొన్నారు.

# వివాహిత అదృశ్యం


సరోజ (ఫైల్)

చిలిపిచెడ్, ఏప్రిల్ 15 : చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహిత అదృశ్యమైన ఘటన చోటుచేసుంది. ఎస్సై నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. రహీంగూడ తండాకు చెందిన దేవసోత్ సరోజ (35) భర్త నామ్యా నాయక్‌తో తరుచూ గొడవలు జరుగుతూ ఉండేవని సరోజ తండ్రి నునావత్ ప్రభు నాయక్ తెలిపారు. ఈ నెల 14న భర్తతో గొడవ పడి సరోజ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. తండ్రి నునావత్ ప్రభు నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## నేడు చిలిపిచెడ్ మండలంలో ఎమ్మెల్యే పర్యటన

చిలిపిచెడ్, ఏప్రిల్ 15 : చిలిపిచెడ్ మండలంలోని సోమక్కపేట పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విచ్చేయనున్నట్లు సోమక్కపేట పీఏసీఎస్ చైర్మన్ ధర్మారెడ్డి, ఐకేపీ ఏపీఎం ప్రేమలత తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు మండలంలోని అన్ని గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ కొనుగోలు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాలకు చెందిన మాజీ గ్రామ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ, పీఏసీఎస్ డైరెక్టర్లు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి తెలిపారు.

## అగ్నిమాపక శకట వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


అగ్నిమాపక శకట వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫైర్ సిబ్బంది

రామాయంపేట, ఏప్రిల్ 15 : రామాయంపేట పట్టణంలోని అగ్నిమాపక శకట వారోత్సవాల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. నేటి నుంచి వారం రోజుల పాటు అగ్నిమాపక శకట ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సిబ్బంది తెలిపారు. రామాయంపేట పట్టణంలోని ప్రధాన కేంద్రాలైన బస్టాండు, మెదక్ చౌరస్తా, అక్కన్నపేట రైల్వే స్టేషన్‌లో వివిధ రకాలుగా విన్యాలసాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నరేశ్, నరేందర్, బాబురావు, బాలరాజు, లింగం, సిబ్బంది ఉన్నారు.

## రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు

రామాయంపేట, ఏప్రిల్ 15 : రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు తప్పదని రామాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట రాజ గౌడ్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడంతో విలువైన ప్రాణాలు పోవడానికి రైతులే కారణమవుతారని పేర్కొన్నారు. ఇకపై ధాన్యం రోడ్లపై కనిపిస్తే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు ధాన్యం గింజలను తరలిస్తామన్నారు. ధాన్యం ఆరబోసిన వ్య క్తులపై కేసులు కూడా నమోదు చేస్తామని తెలిపారు.

## శానిటేషన్ కిట్స్ ఐడీకార్డులు అందజేత

రామాయంపేట, ఏప్రిల్ 15 : పంచాయతీ కార్మికులకు శానిటేషన్ కిట్లు, ఐడీ కార్డులను అందజేసినట్లు కార్యదర్శి మహేందర్ అన్నారు. మంగళవారం రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు హ్యాండ్ గ్లౌజెస్, బూట్లు, డ్రెస్సులను అందజేశారు. అనంతరం కార్యదర్శి మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యం బాగుండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం శానిటేషన్ కిట్లను అందజేసిందన్నారు. కార్మికుల కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన ఐడీ కార్డులను అందజేసినట్లు తెలిపారు.

## విద్యార్థుల వివరాలు అందించాలి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 15 : వచ్చే విద్యాసంవత్సరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించడానికి విద్యార్థుల సంఖ్యతో పాటు కొలతలు వెంటనే సెర్ప్ సిబ్బందికి అందజేయాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. మంగళవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో నిర్వహించిన హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలకు సంబంధించిన అన్ని ఆన్‌లైన్ వివరాలను సెలవులు వచ్చేలోగా అందజేయాలన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు విఠల్, రాజేశ్వర్ ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు హల్దీవాగులో ఇసుక గుర్తింపు

వెల్దుర్తి, ఏప్రిల్ 15 : వెల్దుర్తి మండలంలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు హల్దీవాగు నుంచి ఇసుక తరలించడానికి ఇసుక రీచ్‌ల కోసం సర్వేలు నిర్వహించినట్లు ఇరిగేషన్ డీఈ రాజేందర్, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన వెల్దుర్తితో పాటు మండలంలోని నెల్లూర్ గ్రామాల పరిధిలోని హల్దీవాగులో భూగర్భజల శాఖ అధికారి లావణ్య, మైనింగ్ ఆర్ఐ లక్ష్మీనారాయణలతో కలిసి వారు సర్వేలు నిర్వహించారు. వెంట ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.